బాతుల పంపకం

లాత్వియా జానపద కథ





అనగా అనగా గిరి అనే ఒక పేద రైతు ఉండేవాడు. అతడు ఇల్లు కట్టుకోవాలని అనుకున్నాడు. కానీ అతని దగ్గర దుంగలు లేవు, డబ్బులూ లేవు. అతడి దగ్గర ఒకే ఒక్క బాతు ఉంది.

ఒక రోజు గిరి ధైర్యాన్ని కూడగట్టుకుని భూస్వామి దగ్గరకు వెళ్లి తన కష్టాలు చెప్పుకున్నాడు:

“అయ్యా, నాకు కొన్ని దుంగలు ఇవ్వండి. వాటికి బదులుగా మీకు నా బాతుని ఇస్తాను.”



భూస్వామి అందుకు ఒప్పుకున్నాడు.

"నాకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు, నా భార్య, నేను కలిపి మొత్తం ఆరుగురం ఉన్నాం. ఒక్క బాతుని మేము ఎలా పంచుకోవాలి?"

గిరి దగ్గర సమాధానం తయారుగా ఉంది:

"అయ్యా! మీరు ఇంటికి తలకాయ వంటి వాళ్లు కాబట్టి బాతు తల మీకు. మీ భార్య ఇల్లంతా గునగునా కలియతిరుగుతూ ఉంటుంది, కాబట్టి తోక ఆమెకు. మీ కూతుళ్లు అందమైనవాళ్లు, పిట్టల్లాగా ఎగిరేవాళ్లు. కాబట్టి వాళ్లకి చెరొక రెక్క. మీ కొడుకులు మీ కుటుంబానికి ఆధారం, బాతు కాళ్లు వాళ్లకి. నేను కష్టించి పొట్టపోసుకునే పేద రైతుని, కాబట్టి పొట్ట నాకు."



బాతుని అంత బాగా పంచిన రైతు తెలివిని భూస్వామి మెచ్చుకున్నాడు. అతడి వంతు పొట్టతో పాటు, అతడి ఇంటికి కావలసిన దుంగలు ఇచ్చాడు.

అనుకున్నదానికంటే ఎక్కువ దొరకటంతో గిరి సంతోషంగా ఇంటికి వెళ్లాడు.

ఈ విషయం విన్న మరొక పేద రైతు ఇలా అనుకున్నాడు:

'నేను కొట్టం కట్టుకోవాలి కానీ నా దగ్గర డబ్బులు లేవు. నా అయిదు బాతులను భూస్వామి దగ్గరకు తీసుకెళతాను.'

అనుకున్నదే తడవుగా బాతులతో భూస్వామి ఇంటికి బయలు దేరాడు.



‘వీటిని పంచుకోవటం ఎలా?’ ఆలోచనలో పడ్డాడు భూస్వామి.

రైతు కూడా బుర్ర ఎంత బద్దలు కొట్టుకున్నా వాటిని పంచటానికి ఏ ఉపాయమూ తట్టలేదు.

చివరికి బాతులను పంచటానికి గిరికి కబురుపెట్టాడు భూస్వామి.

గిరి సంతోషంగా భూస్వామి ఇంటికి బయలుదేరాడు – బాతులను పంచటానికి తనని పిలవటం ఎంతో గౌరవంగా భావించాడు.

గిరి ఒక బాతును తీసుకుని భూస్వామికి ఇచ్చి ఇలా అన్నాడు:



"మీరు, మీ భార్య, ఈ బాతు కలిపి మొత్తం ముగ్గురు!" రెండవ బాతును కొడుకులకు ఇస్తూ ఇలా అన్నాడు:

"ఇద్దరు కొడుకులు, ఒక బాతు కలిపి మొత్తం ముగ్గురు!" మూడవ బాతును కూతుళ్లకు ఇచ్చాడు:

"ఇద్దరు కూతుళ్లు, ఒక బాతు కలిపి మొత్తం ముగ్గురు!"

గిరి రెండు బాతులను తీసుకుని ఇలా అన్నాడు:

"ఒక రైతు, రెండు బాతులు - మొత్తం ముగ్గురు!"

ఈ రకంగా రైతు బాతులను పంచటమే కాకుండా ఆ క్రమంలో రెండు బాతులను కూడా పొందాడు!



యజమాని - వంటమనిషి

మోల్దేవియన్ జానపద కథ





అనగనగా ఒక భూస్వామి ఉండేవాడు. అతడు అందరి యజమానుల వంటివాడే. ఒకసారి అతడు బయటకు వెళుతూ వంటమనిషిని పిలిచి బాతుకూర వేపుడు చేసిపెట్టమన్నాడు.

"మాంసం కూరలో పిసరంత కూడా తినవద్దు. తిన్నావంటే ఏమవుతుందో తెలుసుగా!" అంటూ వంటమనిషిని హెచ్చరించాడు యజమాని.

"అలాగే, అయ్యా!"

"నేను తిరిగి వచ్చేసరికి అన్నీ సిద్ధంగా ఉండాలి. నోట్లో వేసుకుంటే బాతుకూర కరిగిపోయే లాగా ఉండాలి. వంట బాగుంటే నా మనసు కూడా సంతోషంగా ఉంటుంది, తెలుసుగా!" అన్నాడు యజమాని.



"అలాగే, అలాగే అయ్యా!"

యజమాని బండెక్కి వెళ్లిపోయాడు. బాతుకూర వండటానికి పూనుకున్నాడు వంటమనిషి. ఏ లోపం లేకుండా దానిని బాగా వేయించాడు. అది అన్ని వైపులా సమంగా కాలి బంగారు రంగులో ఉంది. దానిని చూస్తే చాలు నోరూరిపోతుంది.

అంత బాగా కుదిరిన కూరని వంటమనిషి రుచి చూడకుండా ఉండలేకపోయాడు. దాంతో బాతు కాలు ఒకటి కోసుకుని తినేశాడు.

యజమాని తిరిగి వచ్చిన తరువాత అన్నం పెట్టమన్నాడు. బాతు కూర బాగా రుచిగా ఉండటంతో ఇష్టంగా తిన్నాడు. ఉన్నట్టుండి బాతు మాంసంలో ఒక కాలే ఉండటం గమనించాడు. రెండో కాలు ఏమయ్యింది?



యజమాని కోపంతో చిందులేసినంత పనిచేశాడు.

"బాతు కూరలో పిసరంత కూడా ముట్టుకోవద్దన్నానా?" అంటూ వంట మనిషి మీద అరిచాడు.

"చెప్పారు, అయ్యా!"

"మరి కాలు మొత్తం ఎందుకు తిన్నావు?"

"నేను తినలేదు అయ్యా!"

"మరి బాతు రెండో కాలు ఏమయ్యింది?" అరిచాడు యజమాని.

"అయ్యా, బాతుకు ఒకటే కాలు ఉంది!"

యజమానికి మరింత కోపం వచ్చింది.



"నన్ను పిచ్చివాడిని చేద్దామనుకుంటున్నావా? ఎక్కడైనా ఒక్క కాలు బాతు ఉంటుందా?"

"అయితే చెరువు దగ్గరకి పదండి. మీరే చూద్దురు గాని."

"సరే, పద!" అన్నాడు యజమాని. "అబద్ధం చెప్పావని తెలిసిందో నిన్ను ఏం చేస్తానో నాకే తెలియదు."

యజమాని, వంట మనిషి బాతులున్న చెరువు దగ్గరకు వెళ్లారు. ఆ రోజు బాగా ఎండగా ఉంది. దాంతో బాతులు నీటిలోకి వెళ్ళి ఒంటికాలి మీద నిలబడి ఉన్నాయి. రెండవ కాలుని పొట్టకింద పెట్టుకుని ఈకలు శుభ్రం చేసుకుంటూ ఉన్నాయి.

"అయ్యా చూశారా! బాతులకు ఒకటే కాలు ఉంది," అన్నాడు వంటమనిషి.

"ఓరి, మోసగాడా!" అరిచాడు యజమాని.



అతడు తను చేతులను ఊపుతూ "హుష్, హుష్!" అంటూ అరిచాడు.

బాతులు భయపడిపోయి, రెండవ కాలు కూడా కింద పెట్టి చెల్లాచెదురుగా పరిగెత్తసాగాయి.

"ఎవరు చెప్పింది నిజం?" యజమాని అడిగాడు. "బాతుకు ఎన్ని కాళ్లున్నాయి?"

వంట మనిషి వెంటనే బదులిచ్చాడు: "బాతు మాంసం తినేటప్పుడు కూడా 'హుష్' అని గట్టిగా అరిచి ఉండాల్సింది. అది భయపడిపోయి రెండవ కాలు బయట పెట్టి ఉండేది."

నోటమాట లేకుండా నిలబడిపోవటం యజమాని వంతయ్యింది.

కానీ అప్పటినుంచి వంటమనిషిని తనతో పాటు కూర్చుని తిననిస్తున్నాడు.



How the Goose Was Divided; A Latvian Folk Tale
The Landlord and the Cook; A Moldavian Folk Tale
Illustrated by N. Bairachny, published by Minsk Yunatstva Publishers, 1989

బాతుల పంపకం

లాత్వియా జానపద కథ

యజమాని - వంటమనిషి

మోల్దేవియన్ జానపద కథ
అనువాదం : కె. సురేష్, బొమ్మలు : ఎన్. బైరాచ్ని

భారతదేశ మొదటి ముద్రణ : మంచి పుస్తకం
ప్రచురణ కాలం : జులై 2013

ప్రతులు : 3000

వెల : రూ. 20/-

మంచి పుస్తకం

ప్రచురణ, ప్రతులకు :
మంచి పుస్తకం
12-13-439, వీధి నెం. 1
తార్నాక, సికింద్రాబాదు - 500 017
ఫోన్ : 94907 46614.
email : info@manchipustakam.in
website : www.manchipustakam.in

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్
అజామాబాద్, హైదరాబాదు - 500 020
ఫోన్ : 040 - 2767 8411

ISBN 978-93-80153-97-1